# తెలుపు-నలుపు

రాజ్యలక్ష్మి కొలాస్కర్




టాక్సీ ట్రిక్సున్ వీధులలోనుంచి దూసుకు పోతోంది. ఇల్లెప్పుడు చేరుకుంటామా అని ఆత్రంగా నరాలను బిగపట్టుకుని కూర్చుంది శిల్ప. భర్త కేవలం అరడుగు దూరంలోనే కూర్చున్నా ఎన్నో మైళ్ళ దూరంలో వున్నట్లున్నాడు. అతని వైపు చూడాలంటేనే భయంగా వుంది. అతనిలో ఎందుకు హఠాత్తుగా ఇంత మార్పు కల్గిందో అర్థం కావటంలేదు. ఇంటిమంచి డాక్టరు దగ్గరకని బయల్దేరేటప్పుడు మామూలుగానే వున్నాడు. మరి ఇంతలోనే... కారణం అడుగుదామంటే నిప్పులు కురిపించే కళ్ళతోనే నోరు మూయించేస్తున్నాడు.

"ఎంతకీ ఈ దూరం తరగదేమిటి బాబూ !" అని శిల్ప మనసులో విసుక్కుంటుండగానే కాబ్ — చిన్న కుదుపుతో వారి ఇంటిముందు ఆగింది. శిల్ప దిగి లాక్ కీతో తలుపు తీస్తుంటే రాజీవ్ టాక్సీ ఫేర్ చెల్లించి లోనికొచ్చాడు.

భయం భయంగానే అడిగింది శిల్ప.

"డాక్టరేమన్నాడండీ ?"

అగ్నిపర్వతం బద్దలయింది. శిల్ప చెంపలు ఎడాపెడా వాయించేశాడు. "ఏం తెలియని నంగనాచిలా ఎంత అమాయకంగా అడుగుతున్నావు ? మీ ఆడజాతే ఇంత ! ఎంతకైనా తగుదురు. అయినా డాక్టరు దగ్గర కెళ్ళేముందైనా, ఈ నాటకం చెప్తే నాకు అక్కడ ఫూల్‌నయ్యే అవస్థ తప్పేది కదా ! లేకపోతే నాలాగే డాక్టర్లకికూడా ఈ విషయం తెలియకుండానే వుండిపోతుందనుకున్నావా ?"

అయోమయంగా రెండు చెంపలపై చేతు లుంచుకుని చూస్తున్న శిల్పపై డాక్టరు రిపోర్టు విసిరేసి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. కొద్ది నిమిషాలలో తేరుకుని రిపోర్టు చదవసాగింది. కళ్ళు లైన్లవెంట పరుగులుపెడ్తుంటే ఆశ్చర్యంతో అపనమ్మకంతో భర్త ప్రవర్తన పూర్తిగా మరిచి పోయింది. రిపోర్టు చిన్నదే ! చదవటం అయిదు నిముషాల్లో అయిపోయింది. తన కళ్ళు పొరపాటు పడలేదు కదా అనుకుంటూ మళ్ళీ చదివింది. అదే మేటరు ఒక్కో అక్షరం ఒక్కో తేలుపోటులా బాధిస్తుంటే — కళ్ళు కన్నీటి సరస్సులయ్యాయి. బుర్ర మాత్రం ఇదెలా సాధ్యం ? అంటూ పదే పదే ఎవరినో ప్రశ్నిస్తోంది !

శిల్ప వాళ్ళు స్వతహాగా ఆంధ్రులే అయినా తరతరాల నుంచి వ్యాపార రీత్యా బెంగుళూరులో స్థిరపడి పోయారు. శిల్ప పుట్టింది పెరిగింది బెంగుళూరులోనే. శిల్ప తండ్రికి బట్టల వ్యాపారం. శిల్ప అన్నలిద్దరూ కూడా వ్యాపారంలో స్థిరపడి పోయారు. శిల్ప మాత్రం యమ్. యస్. సి. వరకు చదివింది. దూరపు బంధువుల ద్వారా రాజీవ్ సంబంధం కుదిరింది. రాజీవ్ డాక్టరేట్ చేసి బెంగుళూరులోనే ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో లెక్చరరుగా పనిచేస్తున్నాడు. ఆస్తి లేక పోయినా చదువుంది, అందముంది, మంచి వుద్యోగ ముంది. మనకున్న ఆస్తి చాలదా అనుకుని శిల్ప తల్లిదండ్రులు శిల్ప రాజీవ్‌లను ఒకటి చేశారు.

మొదట్లో ఫామిలీ ప్లానింగ్ వద్దను కున్నారు. పిల్లలు త్వరగా పుడితే రిటైరయ్యేలోగా వారి బాధ్యత వదిలి పోతుంది. అదీకాక ఒకళ్ళిద్దరితో ఆపేస్తే వాళ్ళు స్కూల్లో చేరగానే శిల్ప ఏకంగా ఉద్యోగంలో చేరచ్చు. మధ్య మధ్య ఆటంకులుండవు.

పెళ్ళయి మూడేళ్ళవుతున్నా వాళ్ళకి పిల్లలు పుట్టలేదు. పెళ్ళయిన సంవత్సరం నుంచే శిల్ప తల్లి సన్నసన్నగా సతాయించటం మొదలు పెట్టింది. ''కూతురు బిడ్డల్ని ఎత్తుకునే దెప్పుడు'' అంటూ. రెండేళ్ళయ్యేసరికి ఆవిడ గొడవ ఎక్కువయింది. ఆవిడ సంతృప్తి కోసం భార్యా భర్త లిద్దరు డాక్టరుతో పరీక్ష చేయించుకున్నారు కూడా ! ఆయన ఇద్దరిలో ఏ లోపమూ లేదన్నాడు. ఇంత ఖంగారేమిటి అని నవ్వేరు కూడా !

శిల్ప తండ్రి తనకున్న ఆస్తినంతా నాలుగు భాగాలుచేసి తనకొక వంతు ముగ్గురు పిల్లలకీ మూడు వంతులుగా విల్లు వ్రాసేశారు. శిల్ప వెనుక ఆస్తిచూసి స్నేహితులు బంధువులు ఒకే విధంగా పీడించటం మొదలు పెట్టారు. మా పిల్లని పెంచు కోమంటే మా వాడ్ని తీసుకోమంటూ ! కొందరు చాదస్తపు బంధువులు ''మా అబ్బాయి కాలుపెట్టిన వేళావిశేషంగా మీకు సంతానం కల్గుతుందేమో !'' అంటూ పొగడేసేవారు కూడా !

రాజీవ్‌కీ ధోరణి విసుగెత్తిపోయింది. శిల్పకీ తనకీ లేని ఖంగారు వీళ్ళకెందుకో ! అతను బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. విదేశాలలో ఉద్యోగాల కోసం పడిన ప్రకటనకల్లా అప్లయ్ చెయ్యటం మొదలుపెట్టాడు. మొట్టమొదట బ్రిక్స్టన్ ఆఫర్ వచ్చింది. జీతం కూడా బాగా ఎక్కువ.

ప్రయాణ మవుతుంటే శిల్ప తల్లి ఏడ్చింది. ''కళ్ళముందుంటుంది కదాని ఈ సంబంధం చేసు కున్నాము. ఇప్పుడింత దూరం వెళ్ళిపోతున్నారు'' అంటూ. 'మధ్యలో ఒకసారి వస్తానులేమ్మా' అని ఓదార్చి వెళ్ళిపోయింది శిల్ప.

బ్రిక్స్టన్‌లో ఒక ఇండియన్ లొకాలిటీలో ఇల్లు తీసుకున్నాడు రాజీవ్, శిల్ప మరీ ఒంటరిగా ఫీలవకుండా వుంటుందని. వెళ్ళిన రెండు మూడు నెలలకి శిల్పకికూడా టెక్నీషియన్‌గా ఉద్యోగం దొరికింది ... అన్ని మాడర్న్ వసతులతో. శిల్పకి ఇల్లు చక్కబెట్టుకోవటం, ఉద్యోగం చేసుకోవటం ఏమంత కష్టంగా ఉండేదికాదు. ప్రొద్దున్న ఎనిమిది గంటలకు ఇల్లు వదిలేసి చెరొక త్రోవగా వెళ్ళిపోయిన భార్యాభర్తలు మళ్ళీ సాయంత్రం ఆరింటికి ఇల్లు చేరుకునేవారు. ఎవరో ఒకరు అతిధులు రావటమో, లేక తెలుగు అసోసియేషన్ ఏర్పాటు చేసే ఫంక్షన్‌కి, ఏమీ లేకపోతే టి. వి. ప్రోగ్రాములు వాచ్ చెయ్యటం. వీకెండ్స్ బీచ్‌కి వెళ్ళేవారు. లేకపోతే గెట్ టుగేదర్‌లు. కాలం ఆనందంగా గడిచిపోతోంది. రాజీవ్ పనిమీద రెండు మూడురోజులు ఎక్కడికైనా వెళ్ళినా శిల్పని స్నేహితులు ఒంటరితనం ఫీలవకుండా చూసుకునేవారు.

చీకటిలో కాంతిరేఖలు కన్పించటం అరుదు కాని, ఆనందంలో అపశ్రుతి విన్పించడానికి ఆట్టే కాలం పట్టదెప్పుడూ ! వీళ్ళు వచ్చిన సమయంలో చెదురు మదురుగా వుంటున్న జాతి విద్వేషపు అల్లర్లు క్రమక్రమంగా వేగం పుంజుకోసాగాయి. నల్ల వాళ్ళందరూ ఆ దేశం విడిచిపోవాలని, 'యుకె' శ్వేత ద్వీపంగా మిగిలిపోవాలనే తెల్లచర్మపు ఉన్మాదులలో వివేకం విచక్షణా జ్ఞానం నశించాయి. శరీరంపైనే కాని మనసులో తెల్లదనంలేని ఆ మూర్ఖులు అన్య దేశస్తులు ఎక్కడ కన్పించినా వారిని అవమానించటం, ఫిజికల్‌గా అస్సాల్ట్ చేసి గాయపర్చటం ఒక్కోసారి హత్య చేయటంకూడా జరిగేది. వీరి షాపులను కొల్లగొట్టి దోచుకోవటం, నిప్పంటించటం, పోలీసులు వచ్చినా, ప్రాణ రక్షణ కోసం ప్రతిఘటిస్తున్న నల్లవారినే మళ్ళీ హెరాస్ చెయ్యటం.

ఒకసారి షాపింగ్ కోసం వెళ్తున్న శిల్పకి భయంకరమైన అనుభవం ఎదురయింది. నలుగు రైదుగురు తెల్ల యువకులు (స్కిన్‌హెడ్స్) ఆమెను చుట్టుముట్టి నానా మాటలు అనసాగారు. ఒకడు ఆమె జుట్టుపట్టి లాగితే ఇంకోడు చీర లాగబోయేడు. శిల్ప భయంతో స్పృహతప్పి పడిపోయింది. ఆ రోజు ఏమయిపోయేదో ! చుట్టుపక్కల షాపుల్లో ఉన్నవాళ్ళు బయటకు వచ్చి తెలివి తెప్పించి ఆమెను ఇంటి దగ్గర విడిచారు. ఆ రోజు నుంచి ఉద్యోగం మానుకుంది. అప్పుడు కాకపోయినా ఇంకొద్ది రోజులలోనైనా మానుకోవలసివచ్చేది. ఎందుకంటే ఆ సంఘటన జరిగిన కొద్ది రోజులకే ఇండియన్ హైకమీషనర్ భారత స్త్రీలు ఒంటరిగా బయటకు వెళ్ళరాదంటూ ప్రకటించాడు న్యూస్‌పేపర్లలో !

## ప్రగతెప్పుడొస్తుంది

ప్రగతెప్పుడొస్తుంది ప్రగతెప్పుడొస్తుంది
ప్రతివాడికీ మంచి బ్రతుకెప్పుడొస్తుంది
మనిషిలో సభ్యత
మనసులో మమత
సంఘంలో సమత
జాతిలో ఘనత
వందిరంతా పాకిన నేతిబీరపాదైతే
ప్రగతెప్పుడొస్తుంది ప్రగతెప్పుడొస్తుంది.

— టి. ఎస్. ఎస్. రంగనాథ్

రాజీవ్‌తో ఇండియా వెళ్ళిపోదామంది. రాజీవ్ ఎంత మాత్రం ఒప్పుకోలేదు. ''శిల్పా ! డోంట్ బి సిల్లీ. నాకు ఎంతో కష్టంమీద లీన్ దొరికింది. ఇప్పుడొదిలేసుకుంటే మళ్ళీ ఈ అవకాశం ఎన్నేళ్ళకో ! ఇప్పుడిప్పుడే నా వర్కు చురుకుగా ప్రోగ్రెస్ అవుతుంది. ఇది పూర్తయితే తేలికగా అరడజను పేపర్లు ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో పబ్లిష్ చేయచ్చు. ఇండియాలో తలక్రిందులుగా తపస్సు చేసినా ఇంత స్వల్పకాలంలో అంత వర్కు చెయ్యలేను. ఐ కెన్ టేక్ కేర్ ఆఫ్ మై సెల్ఫ్ క్వైట్ వెల్. డోన్ట్ వర్రీ.''

శిల్ప ఇంకేమనలేకపోయింది. కాని ప్రొద్దున్న లాబ్‌కి వెళ్ళిన మనిషి సాయంత్రం క్షేమంగా తిరిగి వస్తాడనే నమ్మకం జరుగుతున్న సంఘటనలవల్ల పోయింది. ప్రతి నిముషం టెన్షన్. దానిమూలంగా ఇంకేదన్నా వ్యాపకం కల్పించుకుందామన్నా మనసు లగ్నమయ్యేదికాదు. ఎప్పుడూ దిగులుగా వుండేది శిల్ప.

ఆమె అవస్థ చూసిన గుజరాతీ ఫ్రెండొకావిడ సలహా ఇచ్చింది. ''శిల్పా ! ప్రెగ్నెంట్ అయితే పుట్టబోయే పాపలను గురించి ఊహించుకుంటూ వాళ్ళకి స్వెట్టర్లు సాక్సు తయారుచేసుకుంటూ టైము ఇట్టే గడిచిపోతుంది. ఇంక పుట్టిన తరువాత సరేసరి. పెళ్ళయి నాలుగేళ్ళయినా పిల్లలు లేరు కదా ! నీలో ఏదైనా మైనరు డిఫెక్టు ఉంటే సర్జరీచేసి సెట్‌రైట్ చేస్తారు. ట్రై చెయ్య కూడదూ !'' శిల్ప నవ్వి అంది – ''అది ఇండియా లోనే అయిందండీ.''

''ఇక్కడ డాక్టరు మరింత శ్రద్ధగా చూస్తారు. ఇంకోసారి వెళ్తే నష్టంలేదు కదా ''

శిల్పకీ ఒంటరి జీవితం బోరుకొడ్తోంది ఆ రోజు రాజీవ్ రాగానే అడిగింది. అతను తేలిగ్గా కొట్టిపారేశాడు. ''ఇంకొన్నాళ్ళు చూద్దాంలే'' అంటూ.

శిల్పకి ఏ విషయమైనా రెండోసారి చెప్పటం, అడగటం అలవాటులేదు. అందుకే మళ్ళీ రాజీవ్‌తో ఆ సంగతి ఎత్తలేదు. రెండు మూడునెలలయ్యేసరికి రాజీవ్‌కి శిల్ప చిక్కిపోతోందన్పించింది. ఆ రోజు లాబ్‌నుంచి త్వరగా వచ్చి శిల్పని డాక్టరు దగ్గరకు బయల్దేరదీశాడు.

*   *   *

ఆ రిపోర్టు శిల్పకి కేవలం పది పదిహేను వాక్యాలున్న కాగితంలా కన్పించటంలేదు. పెను భూతంలా భయపెడ్తోంది చివరి రెండు వాక్యాలు కళ్ళముందు నిలవగానే శిల్ప గజగజ వణికింది. చాలా సేపయ్యాక నెమ్మదిగా లేచి భయం భయంగా బెడ్ రూమ్‌లోకి వెళ్ళింది. రాజీవ్ బెడ్‌పై పడుకుని సీలింగ్‌వైపు చూస్తున్నాడు. మెల్లగా పిల్చింది. ''ఏమండీ.''

రాజీవ్ కళ్ళలోని అసహ్యం శిల్పని అసంకల్పితంగా ఒకడుగు వెనక్కి వేయించింది. ధైర్యాన్ని కూడగట్టుకుంటూ అంది. ''నాకేం తెలియదండీ ! డాక్టరు పొరపడి ఉండొచ్చు కదా ! నాతో నాలుగు సంవత్సరాలుగా వున్నారు. నన్ను నమ్మలేరా ?''

రాజీవ్ లేచి కూర్చున్నాడు. ''శిల్పా ! నన్ను

అనవసరంగా రెచ్చకొట్టకు. నీకు తెలియకుండా సాధ్యమయ్యే పనేనా అది. ఐనా నీధైర్యం నాకు ఆశ్చర్యంగా వుంది. బహుశా డాక్టరుకు కూడా కనుక్కోవటం ఎలా కుదుర్తుందను కున్నావేమో! అందుకే ఒక సారి నేను వద్దనగానే మళ్ళీ టెస్టింగ్ కెళ్దామని పొరపాటునైనా అనలేదు.''

శిల్ప అక్కడ నిలబడలేక వెళ్ళిపోయింది. ఆ రోజు నుండి జీవితం దుర్భరమయింది. రాజీవ్ ఆమె ముఖం చూడడు ఆమెతో మాట్లాడడు ఆమె వండినది తినడు. లంచ్ ఎలాగూ లాబ్‌లోనే! పొద్దున్న పాలు తాగేసి ఒక చాకొలెట్‌స్లాబ్ తినేసి వెళ్ళిపోతాడు. సాయంత్రం శాండ్‌విచ్ ఫ్రూట్ జ్యూస్.

శిల్పని తిన్నావా అని అడిగే వాళ్ళులేరు. డాక్టర్ రిపోర్టు కంటే రాజీవ్ విముఖత్వం ఆమెకు భరించ శక్యంకాని మనోవ్యధగా తయారయింది. మరీ నీరసంగా అన్పించినప్పుడు ఒక గ్లాసు ఆరంజి జ్యూసో లేక పైనాపిల్ జ్యూసో తాగేది. వారం రోజులు అతి నెమ్మదిగా గడిచాయి.

ఆ రోజు రాజీవ్ వస్తూనే శిల్పని పిలిచాడు. ''నీవు ఇండియా తిరిగి వెళ్ళటానికి ఏర్పాట్లు చేశాను. ఇంకో వారం వరకు ఫ్లైటు బుకింగ్ దొరకలేదు. వచ్చే బుధవారం నీ ప్రయాణం. నీక్కావలసిన వన్నీ తీసుకుని వెళ్ళిపో! డైవర్సు కావాలాంటే ఫైల్ చేసి కాగితాలు పంపించు. సైన్ చేసి • తిరిగి పంపుతాను. లేకున్నా నువ్వేంచేసినా నాకభ్యంతరం లేదు.'' ఒక్క నిమిషం ఆగి తిరిగి అన్నాడు— ఈసారి అతని గొంతులో విచారం. ''శిల్పా! ఈ నాలుగేళ్ళ సాహచర్యానికి థాంక్స్. ఇండియా వెళ్ళటం ఇష్టంలేకపోతే నువ్వు ఏ వ్యక్తి కోసం ఈ పని చేశావో అతని దగ్గరకే వెళ్ళిపో! అతను ఆదరిస్తే!'' ఆమె వైపు చూడకుండా తన గదిలోకి వెళ్ళి తలుపేసుకున్నాడు. అతనామెను పరీక్షగా చూస్తే మరోసారి ఆలోచించి తన నిర్ణయం మార్చుకునేవాడేమో! శిల్ప నిల్చున్నచోటే కుప్పకూలిపోయింది.

సోమవారం వచ్చింది. దానితోపాటే శిల్ప రెండో అన్నయ్య నుంచి ఉత్తరం. శిల్పకీ అతనికీ మధ్య వయోభేదం ఎక్కువ లేకపోవటంతో వాళ్ళిద్దరికీ సాన్నిహిత్యం కొంచెం పరస్పర అభిమానం ఎక్కువ.

ఆ ఉత్తరం చదువుతోంటే శిల్ప బుర్రలో ఏదో మెరిసింది! ఇక్కడికి వచ్చిన మొదటి

## తెలుపు – నలుపు

సంవత్సరం తమకు దాదాపు ఫామిలీ డాక్టరుగా వ్యవహరించిన డా॥ బియాట్రిస్ గుర్తొచ్చింది. సంవత్సరం అయ్యాక కలర్‌డ్ పీపుల్‌ని తనింక ట్రీట్ చెయ్యనంటే దూరమైనా ఇండియన్ డాక్టరు దగ్గరకి వెళ్ళడం ప్రారంభించారు.

వెంటనే ఉత్తరం మడిచి జాగ్రత్తగా కప్ బోర్డులో దాచింది. నీరసం సంగతి మరిచిపోయింది. తను కూరలు కోసుకునే పదునైన ఫోల్డింగ్ నైఫ్ తీసుకుని పర్సులో వేసుకుని బయల్దేరింది.

గంటలోపునే తిరిగి వచ్చేసింది. వచ్చిన దగ్గర్నుంచి భర్త రాకకోసం క్షణాలు లెక్కబెట్ట సాగింది.

రాజీవ్ రాగానే మామూలుగా తన గదిలోకి వెళ్ళిపోయాడు. శిల్ప దాచిపెట్టిన ఉత్తరం తీసుకుని అతని దగ్గరకి వెళ్ళింది.

ఆమె అలికిడి వినికూడా రాజీవ్ తిరిగి చూడలేదు. కాని శిల్ప సందేహించలేదు.

''ఏమండీ! నేను మిమ్మల్ని నన్ను వెళ్ళ గొట్టొద్దని బ్రతిమాలడానికి రాలేదు. రెండు రోజుల్లో శాశ్వతంగా విడిపోబోతున్నాం. ఒక్క పావుగంట మీతో మాట్లాడాలనుంది. వింటారా?''

ఏదో విశ్వాసం తొణికిసలాడుతున్న ఆ స్వరానికి ఆశ్చర్యపడుతూ శిల్ప వంక చూశాడు. చూడగానే తోచిన మొట్టమొదటి భావన. ''అబ్బ ఎంత కృశించిపోయింది!'' అసంకల్పితంగా మంచంపై జరిగి ''కూర్చో'' అన్నాడు.

శిల్ప విన్పించుకోకుండా ''ముందిది చదవండి'' అంటూ ఉత్తరం అందించింది. అతని కళ్ళు వంకుల వెంట ఎవరో తరుముతున్నట్లు పరుగులు తీశాయ్. అది ఇలా వుంది —

ప్రియమైన చిన్న!

ఎలా వున్నావు? ఇక్కడ అంతా మామూలే! రోజూ అక్కడ జరుగుతున్న అల్లర్లను పేపర్లో చదువుతుంటే చెప్పరాని ఆందోళనగా వుంటోంది. సాధ్యమైనంతవరకూ అమ్మకీ విషయాలు తెలియ నివ్వకూడదని ప్రయత్నిస్తున్నాం.

ఈ లెటరు వ్రాయటానికి ముఖ్యమైన కారణం ఇంకోటి వుంది. ఈ మధ్యన పేపర్లో పడిన వార్త నన్ను కలవర పర్చింది. అక్కడ కలర్ స్కిన్ వాళ్ళని సాధ్యమైనంతమందిని వాళ్ళకి తెలియకుండానే స్టెరిలైజ్ చేసేస్తున్నారట. కలర్ పాప్యులేషన్ ఇప్పుడున్న దానికంటే పెరగకుండా! అధికారులు ఈ వార్తని ఖండించారనుకో! అయినా నిప్పులేంది పొగరాదు కదా! నీవు బావగారు డాక్టర్లని సంప్రదించే విషయంలో జాగ్రత్తగా ఉండండి. ఆ పేపర్ కటింగ్‌కూడా జతచేస్తున్నాను దీనితో!''

వుంటాను మరి,

ప్రేమతో చిన్నన్నయ్య.

అతను పేపరు కటింగ్‌కూడా చదవడం పూర్తి కాగానే మాట్లాడటం మొదలు పెట్టిందామె.


''ఈ ఉత్తరం చదవగానే మనని మొదట్లో ట్రీట్ చేస్తున్న బియాట్రిస్ గుర్తొచ్చింది. ఆమె దగ్గరకి నేను వైట్ డిశ్చార్జి అవుతుందంటూ వెళ్ళటం, ఆమె చిన్న ఆపరేషన్‌తో సరి అవుతుందని చెయ్యటం గుర్తొచ్చింది. ఉత్తరం చదివిన వెంటనే కల్గిన అనుమానం క్రమక్రమంగా బలపడింది. ఆమె దగ్గరకి వెళ్ళాను. అప్పుడు జరిగిన సంఘటనలు రాజీవ్‌తో చెప్తున్నట్లుకాక ఇంకోసారి తనకు తనే గుర్తు చేసుకుంటున్నట్లుంది.

క్లినిక్‌లో తన వంతు వచ్చేవరకు ఓపిగ్గా కూర్చుంది శిల్ప. లోనికెళ్ళగానే డాక్టరు గుర్తుపట్టి నవ్వుతూ విష్ చేసింది. ''డాక్టర్! మీతో కాన్ఫిడెన్షియల్‌గా మాట్లాడాలి'' అంటూ నర్సు వంక చూపింది. శిల్ప చక్కని ఇంగ్లీషు వినసొంపుగా మాట్లాడుతుంది.

శిల్పమీద ఏ మాత్రం అనుమానంలేని డాక్టరు నర్సుని పంపేసింది. తలుపు మూసుకుంది. అంత వరకూ అతికష్టంగా ప్రసన్నత నభినయిస్తున్న శిల్ప శివంగిలా లేచింది. ''నువ్వు ఆరేడు నెలల క్రిందట నాకు ట్యూబెక్టమీ చేశావు కదూ?'' డాక్టరు ఒక్క క్షణం తడబడి వెంటనే సర్దుకుంది. ''వి సెన్ రాట్! మీరు అర్థం లేకుండా మాట్లాడి నన్ను అవమానిస్తున్నారు. ఇప్పుడే మిమ్మల్ని బయటకి గెంటిస్తాను'' అంటూ బెల్ నొక్క బోయింది.

మెరుపులా ఆ బెల్‌ని ఇవతలికి జరిపేసింది శిల్ప ఆ ప్రాసెస్‌లో దాని కనెక్షన్ కూడా తెంపేస్తూ. పర్సులోంచి ఇండియన్ డాక్టరిచ్చిన రిపోర్టు, చాకు బయటకి తీసింది. రిపోర్టు ఆమె మీదకి విసిరేసింది.

''డాక్టర్! నాకు పుట్టి బుద్దెరిగిన తరువాత జరిగిన మొదటి ఆపరేషను నీ చేతులమీద. ఇది నువ్వే చేశావనటంలో సందేహం లేదు. కాని నీ నోటి





# డాక్టర్ సలహాలు

## డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

### యు. ఆర్. _ పత్తేనపల్లి

నాకు మెన్‌సెస్ అయినపుడు ఏడు, ఎనిమిది రోజులు అవుతుంది. మూడురోజులే అవదు. దీనికి కారణం ఏమిటి ? దీనివల్ల నేను చాలా బాధ పడుతున్నాను. నాకు 3 రోజులే అయ్యేట్లు మీ సలహా కోరుతున్నాను ?

★ మీరు లేడీ డాక్టరు వద్ద పరీక్ష చేయించుకొని, వారి సలహా ప్రకారం కొన్నిమాత్రలు రోజుకి ఒకటి వంతున తీసుకోవలసి ఉంటుంది. సాధారణంగా వారు ఒవ్రాల్, ఓవ్యులెన్, గైనోవ్లార్ వంటి మాత్రలు రోగికి తగినట్లు వాడటం జరుగు తుంది.

### ఆర్. ఎస్. బి. - మచిలీపట్నం

నేను ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించు కున్నాను. ఆపరేషన్ చేయించుకున్న తరువాత పూర్తిగా బలము తగ్గిపోయి నీరసముగా వుంటున్నది. నేను లావు అగుటకు ఏమి చేయవలెను ? ఆడవాళ్ళు ఆపరేషన్ చేయించుకొనిన తరువాత లావుగా అవుతున్నారు. కాని నేను ఎందుచేత సన్నముగా అవుతున్నాను ? శరీరమునకు కావలసిన పోషక పదార్థములన్నియు తీసుకొనుచున్నాను. లావు అగుటకు ఏమైనా మందులు వాడవలయునో తెలుప ప్రార్థన.

★ ట్యూబెక్టమీ ఆపరేషన్‌కీ సన్నబడటానికీ సంబంధములేదు. కొందరు స్త్రీలు ట్యూబెక్టమీ ఆపరేషన్ తర్వాత లావు అయ్యాము అని అను కోవటం జరుగుతున్నది. కాని వాస్తవానికి అది నిజం కాదు. వయస్సు మీరిన వారిలో సహజంగా లావు రావటం జరుగుతుంది. ఆపరేషన్ చేయించు కొన్న తర్వాత ఏ పనీపాటు లేకుండా పూర్తి రెస్టు తీసుకొన్నా లావయ్యే అవకాశం ఉంటుంది.

మీరు క్రమేపీ సన్నబడుతూ ఉంటే ఎక్సరే, మలపరీక్ష మొదలయినవి చేయించుకొని నిపుణులైన వైద్య సలహా పొందటం అవసరం. ఏదో ఆపరేషన్ జరిగింది. ఏదో పోగొట్టుకొన్నాం అనే భ్రాంతి లేకుండా చూసుకోవటం అన్నిటికన్నా ముఖ్యం.

### కె. ఎస్. ఆర్. — వంబూరు

నా వయస్సు 21 సంవత్సరములు. ఐదు సంవత్సరముల నుండి వేసవికాలంలో తలనెప్పి వస్తుంది. ఎడమ కన్నుకు పైగా ఎక్కువ నెప్పి వస్తుంది.

★ వేసవికాలంలో సూర్యరశ్మి తీక్షణవల్ల తలనెప్పి రాగల అవకాశం ఉన్నది. కొందరికి ఒక వైపున మాత్రమే తలనెప్పి రావటం సహజం. ఈ లక్షణం ఉన్నవారు వేసవికాలంలో ఇంట్లో ఉన్న సమయంలో కూడా నల్ల అద్దాల కళ్ళజోళ్ళు వాడటం మంచిది. మందులు వాడటం అంతగా మంచిది కాదు. ఆస్పిరిన్ మాత్రలు తాత్కాలిక ఉపశమనాన్ని కలిగిస్తాయి. నెప్పి ఎక్కువగా ఉన్న వారు సైమెటిల్, నోవాల్జిన్ వంటి మాత్రలు వాడవచ్చును.

### జి ఆర్. — మద్రాస్

నా నుదుటిపై అంగుళము నిలువున పచ్చ బొట్టు వున్నది. చిన్నతనములో నుదుటిపై దెబ్బ తగిలినదట. ఈ మచ్చ, పచ్చబొట్టు వలన నా ముఖము అసహ్యముగా వున్నది. వీటిని ప్లాస్టిక్ సర్జరీ వలన తొలగించ వచ్చునా ? ఈ ప్లాస్టిక్ సర్జరీ ఎక్కడ చేస్తారు ?

★ స్కిన్ గ్రాఫ్టింగ్ చేయటంవల్ల ఈ మచ్చపోయే అవకాశం ఉన్నది. మెడికల్ కాలేజీలతో సమన్వయింపబడిన ఆస్పత్రులలో ఈ చికిత్స చేయటం జరుగుతుంది. తొడమీది చర్మాన్ని ఈ స్కిన్ గ్రాఫ్టింగుకిగాను వాడతారు. ★

---

మీదుగా వినాలనుంది. నువ్వు నిజం చెప్పకపోతే విన్నేం చేస్తానో నాకే తెలియదు. ఇది సౌండ్‌ప్రూఫ్ రూమ్ కదా ! నువు అరిచి మొత్తుకున్నా ఎవరికీ విన్పించదు. అలాగే నువు నిజం చెప్పినా ఎవరికీ విన్పించదు. నీ కెరియర్‌కి భంగమూ రాదు.'' రెండు క్షణాలు ఊపిరి తీసుకోవటాన్కి ఆగింది. ''డాక్టర్! దీనిమూలంగా నా భర్త నన్ను వదిలేశాడు. నాకు భర్త లేని జీవితం లేదు. ఎందుకంటే లవర్ తరువాత లవర్‌ని డ్రెసెస్‌లాగా మార్చే స్వచ్ఛశ్వేత జాతీయులం కాదు కనుక ! నల్లవాళ్ళం కనుక !

చెప్పు ! నిన్ను చంపినా నాకొచ్చే నష్టం లేదు. పోవలసినదంతా ఎలాగూ పోయింది. చెప్పూ !'' టేబుల్‌మీదుగా ముందుకి వంగింది శిల్ప.

ఆమె కళ్ళల్లో డెస్పరేషన్ చూసి బెదిరి పోయింది. బియ్యాట్రిస్. ''చేశాను ! కాని అది నా స్వంత ఇచ్ఛకాదు. అది నా అధికారుల ఆర్డర్లు.'' ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా చెప్పేసింది.

తను వినగోరిన నిజం విన్నాక శిల్పకి ఒక్క క్షణం ఏమనటానికి మాటలు రాలేదు. కొద్ది క్షణాలు ఆమెవంకే చూస్తూ నిల్చుంది. చాకు పర్సులో పెట్టుకుంటూ ఆవేశంలేని స్వరంతో అంది. ''మీరు తెల్లవాళ్ళమని చెప్పకోవటానికి సిగ్గులేదూ ! మతిలేని మీ ఈ ఉన్మాదంతో నాలా ఎంతమంది జీవితాలు నాశనం చేస్తున్నారో ! ఏదైనా మిరకిల్ వల్ల మీ దేశం మొత్తం ఒక్కుమ్మడిగా కారునలుపుగా మీరు హేళనచేసే నీగ్రోలకన్నా నల్లగా అయిపోతే ఎంత బాగుంటుంది !''

వెనక్కి తిరిగి టాక్సీలో ఇంటికొచ్చేసింది.

''ఏమండీ ! దీనికి నేనేవిధమైన సాక్ష్యాధారాలు తీసుకురాలేను. మీకు నా మాటల్లో సత్యం కన్పించి నన్ను నమ్మితే మీకు దూరమైనా ఆ సంతృప్తి మాత్రం మిగుల్తుంది. నమ్మకపోతే నా ఖర్మ అనుకుంటాను.''

వెనక్కి తిరిగి వెళ్ళిపోబోయింది శిల్ప. ఈ విషయం భర్తకి చెప్పాలన్న ఆలోచన ఆమెకు అప్పటివరకు శక్తి నిచ్చింది. అది పూర్తవగానే పదిరోజుల మనోవ్యథ ! నిద్రాహారాలలేమి ఆమెపై ఒక్కుమ్మడిగా దాడిచేశాయి. గుమ్మం పట్టుకున్న చేయి వదలగానే, కళ్ళు చీకట్లు కమ్మగా దబ్బుమని పడిపోయింది.

అప్పటివరకు నిశ్చేతనంగా, నిస్తేజంగా వింటున్న రాజీవ్ పరుగున వచ్చి ఆమెను ఒళ్ళోకి తీసుకున్నాడు. ఎన్నో ఏళ్ళ తరువాత అతని కళ్ళు మళ్ళీ వర్షిస్తున్నాయి. తనకి పున్నామ నరకం లభిస్తుందని కాదు ! నిర్దోషి అయి కూడా తన ప్రియసఖి తనవల్ల భరించిన హింస గుర్తొచ్చి !

రెండు నిమిషాలలో కళ్ళు తెరిచిన శిల్ప అతని కన్నీళ్ళు తుడవబోయింది. ఆ చేతిని, రెండవ చేతిని అందుకొని దోసిలిగాచేసి అందులో ముఖం దాచు కున్నాడు. ''ఈ జన్మకి నీకు ముఖం చూపించలే నన్నట్లుగా'' పొంగుతున్న కన్నీటి మధ్య అన్నాడు. ''శిల్పా ! నీకు నేనూ నాకు నువ్వూ! మనమధ్య మరెవరూ వద్దు. ఇంకో పదిరోజుల్లో నువ్వు కొంచెం కోలుకోగానే ఇండియా వెళ్ళిపోదాం !''

''బ్రిటిష్ ఎయిర్ వేస్''లో ప్రయాణించ టానికి కూడా ఇష్టపడలేదు రాజీవ్. ''ఎయిర్ ఇండియా'' విమానంలో కిటికీ దగ్గర కూర్చుంది శిల్ప. విమానం పైపైకి మేఘాలలోకి ఎగురుతుంటే కనుమరుగవుతున్న ఆ నేలను చూస్తూ భర్త భుజంపై తల వాల్చింది. అనురాగ పూరితంగా ఆమె భుజాల చుట్టు చేయివేసి మరింత దగ్గరగా జరిగాడు రాజీవ్.

తానెరుగని మాతృత్వాన్ని ఇంకెప్పుడూ పొందలేననే విచారంకంటె, చవిచూసిన భర్త సహచర్యం చేజారిపోకుండా కాపాడుకోగల్గిన ఆనందమే ఎక్కువగా వుంది శిల్ప మనసులో ! ★